సాక్షి
నిజామాబాద్
గురువారం । 25 । మే । 2023



నిండుకుండల్లా కాల్వలు
మండుటెండల్లోనూ ఎస్సారెస్పీ కాకతీయ, వరద కాల్వలు నీటితో కళకళలాడుతు న్నాయి.
- 8లో ▸



రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి
రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని జెడ్పీ చైర్మన్ విఠల్ రావు ఆకాంక్షించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.5 /30.0
వాతావరణం
ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండ వచ్చు. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం అయ్యే అవకాశం ఉంది. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్, బోధన్ ఆర్టీవో కార్యాలయంలో స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీటీసీ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 23 వరకు జిల్లాలో 70 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి మరో 20 రోజులు ఉండడంతో తప్పనిసరిగా స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ చేసుకోవాలని, లేని పక్షంలో బస్సులను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సమాచారం అందించినట్లు తెలిపారు.

లాభనష్టాల వివరాలను నమోదు చేయాలి



రెంజల్: మండల మహిళా సమాఖ్య ద్వారా ప్రతి సీజన్‌లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లతో పాటు వరికోత యంత్రం ద్వారా వచ్చే లాభనష్టాలను రికార్డుల్లో ప్రత్యేకంగా నమోదు చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. బుధవారం తాడ్‌బిలోలిలో ఉపాధి పనులను పరిశీలించారు. రెంజల్‌లో ఎంపీడీవో శంకర్‌తో కలిసి పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సీజన్‌లో వరి కోత యంత్రం ద్వారా వస్తున్న లాభాలు, ఖర్చులు, సిబ్బందికి వెచ్చించిన జీతభత్యాల వివరాలను ప్రత్యేకంగా రికార్డుల్లో నమోదు చేయాలని ఏపీఎం చిన్నయ్యకు సూచించారు. లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

అఖిల భారత క్రీడలకు శరత్‌చంద్ర



భిక్కనూరు : ఢిల్లీలో జరుగనున్న అఖిలభారత స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు భిక్కనూరుకు చెందిన బాలుడు కైరంకొండ శరత్ చంద్ర బుధవారం బయలుదేరి వెళ్లాడు. మండల కేంద్రానికి చెందిన కై రం కొండ శరత్ చంద్ర అనే విద్యార్థి మెదక్ జిల్లా రామాయంపేటలో చదువుకుంటున్నాడు. ఇటీవల జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి జాతీయస్థాయి అండర్-15 పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనేందుకు బుధవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లాడు.

బైకుపై పడిన చెట్టు



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో వర్షం పడింది. జాతీయ రహదారి పక్కన వేప చెట్టు విరిగి ద్విచక్రవాహనంపై పడింది. ఈదురు గాలులకు పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

బెదిరింపులు..!

- ఆక్రమణకు గురవుతున్న శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ భూములు
- ఆక్రమణదారులకు అధికార పార్టీ నేతల అండదండలు
- కబ్జాదారులకు నోటీసులిచ్చిన అధికారులకు కీలక ప్రజాప్రతినిధి బెదిరింపులు
- మరోవైపు జలాశయంలో మట్టిని తవ్వి రైతులకు విక్రయం



డొంకేశ్వర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నుంచి ఓవర్ లోడ్‌తో వెళుతున్న భారీ టిప్పర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టొద్దన్నందుకు అధికార పార్టీ నాయకులతో పాటు అధికారులు సైతం బెదిరింపులకు దిగుతున్నారు. శ్రీరాంసాగర్ జలాశయం బ్యాక్‌వాటర్ ప్రాంతమైన నందిపేట, నవీపేట, డొంకేశ్వర్, ఆర్మూర్, బాల్కొండ మండలాల్లోని గోదావరి పరీవాహక గ్రామాల్లో జలాశయం భూమిలో భారీఎత్తున మట్టి నింపి సదరు భూములను కొందరు ఆక్రమిస్తున్నారు. ఇలా ఆక్రమించిన వారికి అధికారులు నోటీసులిస్తే నియోజకవర్గానికి చెందిన కీలక ప్రజాప్రతినిధి సదరు అధికారులను బెదిరింపులకు గురిచేస్తుండడం గమనార్హం. గతంలో ఇలా నోటీసులిచ్చిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులను సస్పెండ్ చేయించానని, జాగ్రత్తగా ఉండాలని సదరు ప్రజాప్రతినిధి హెచ్చరికలు జారీ చేస్తుండడం విశేషం. ఏటేటా పూడిక పేరుకుపోతున్న నేపథ్యంలో జలాశయంలో నీటి నిల్వ కోసం కేటాయించిన భూమిని కాపాడాల్సిన సదరు ప్రజాప్రతినిధి ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతోందని పలువురు అంటున్నారు. ఇదిలా ఉండగా గోదావరికి అవతలి వైపు నిర్మల్ జిల్లాలో సైతం ఓ రిటైర్డ్ డీఎస్పీ బ్యాక్‌వాటర్ పరిధిలోని ఐదెకరాలను ఇలాగే ఆక్రమించిన సందర్భంలో విజిలెన్స్ విభాగం నోటీసులు ఇచ్చింది. ఇక్కడ మాత్రం నోటీసులు ఇవ్వొద్దని కీలక ప్రజాప్రతినిధి బెదిరిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సిబ్బంది కొరత ఉండడం కూడా బ్యాక్‌వాటర్ భూముల పరిరక్షణ విషయంలో ఇబ్బందిగా మారింది.

వార్తలు రాయొద్దంటూ..

శ్రీరాంసాగర్ జలాశయం నుంచి మట్టిని రైతులు తోలుకెళ్లి పొలాల్లో పోసుకోవడం ఎప్పటినుంచో జరుగుతోంది. అయితే దీన్ని కొందరు వ్యాపారంగా మార్చుకున్నారు. యంత్రాలు, టిప్పర్లతో మట్టిని ఇష్టం వచ్చినట్లు తోలుకెళ్తున్న సదరు వ్యక్తులు రైతులకు మాత్రం భారీ ధరకు విక్రయిస్తున్నారు. అయితే ఈ క్రమంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. రోడ్లను తిరిగి నిర్మించాలంటే ప్రభుత్వానికి నిధులు అవసరం. వేల రూపాయలకు మట్టి అమ్ముకుంటూ ఒక్క పైసా కూడా ప్రభుత్వానికి ఇవ్వకుండా దండు కుంటున్నారు. అధికారులు సైతం మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. రైతులు మాత్రం దోపిడీకి గురవుతున్నారు. కాగా ఈ దోపిడీ గురించి పత్రికలకు సమాచారం ఇచ్చిన కొందరు వ్యక్తులపై ఒక మండల స్థాయి రెవెన్యూ అధికారే తీవ్రంగా బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. అధికారులే ఇలా మాఫియాలాగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం 'సాక్షి'లో వచ్చిన కథనం నేపథ్యంలో రెండు గంటల పాటు మట్టి తరలింపను నిలిపేసి మళ్లీ షురూ చేయడం గమనార్హం. సదరు అధికారి ఎప్పటికప్పుడు మట్టి వ్యాపారం చేస్తున్న వాళ్లకు, వాళ్లకు అండదండగా ఉన్న అధికార పార్టీ నాయకులకు సమాచా రం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఒక మండల స్థాయి స్థానిక ప్రజాప్రతినిధి 'సాక్షి'కి ఫోన్ చేసి వార్తలు రాయొద్దంటూ బెదిరింపులకు దిగడం గమనార్హం. రోడ్లు ధ్వంసమైతే మాకేంటి అంటూ వితండవాదంతో మాట్లాడడం విశేషం. పైగా రైతులు ఫుల్‌వీల్స్‌తో వెళతారని, ఆ వార్తలు రాసుకోండని సలహాలు ఇవ్వడం విచిత్రం.

ఈ విషయాలపై జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఈ వ్యవహారాలపై తగిన విచారణ చేయిస్తామన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

- దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- మాక్లూర్‌లో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

మాక్లూర్: ఆధ్యాతికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మాక్లూర్‌లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, అతని సోదరుడు మహేశ్‌గుప్తా నిర్మించిన రుక్మిణి పాండురంగా విఠలేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. తండ్రి ఆశయం మేరకు ఆలయాన్ని నిర్మించిన బిగాల గణేశ్ గుప్తా, మహేశ్ గుప్తాలను ప్రశంసించారు. ధనం, సంపద కలిగినవారెందరో సమాజంలో ఉన్నా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేసేవారు అరుదుగా ఉంటారన్నారు. విద్యారణ్య భారతి స్వామి మాట్లాడుతూ స్వార్థం లేకుండా సమాజ శాంతి కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, మోహన్‌రెడ్డి, గడీల రాములు, కేశ వేణు, సర్పంచ్ అశోక్‌రావు పాల్గొన్నారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈవో పోస్టుల భర్తీ

ఎడపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న దేవాదాయశాఖ ఈవో పోస్టులను పబ్లిక్ సర్వీస్ కమిషనర్ ద్వారా భర్తీ చేయనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరై పూజలు చేశారు. దూపదీప నైవే ద్యం కార్యక్రమాన్ని మరిన్ని ఆలయాలకు విస్తరిస్తామన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఈ విషయమై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆలయ భూముల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సర్పంచ్ లక్ష్మీరాజేందర్, ఎంపీటీసీ హుండీ నాగేందర్, సూర్యకాంత్, సాయరెడ్డి పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయం ధ్వంసం

- హిందూ సంఘాల ఆందోళన
- పోలీసుల అదుపులో ముగ్గురు



ఆలయం వద్ద హిందూ సంఘాలు, స్థానికులు

సుభాష్‌నగర్: నగరంలోని కోటగల్లిలో గల మార్కండేయ మందిరం సమీపంలోని మైసమ్మ ఆలయం బుధవారం ధ్వంసమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయం సమీపంలో ఓ ప్రార్థన మందిరం ఉంది. వచ్చే నెల ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయని ఓ వర్గానికి చెందిన వారు తొలగించే ప్రయత్నం చేశారు. పెద్ద కొమ్మలు విరిగి ఆలయం రేకులపై పడ్డాయి. దీంతో ఆలయ పురాతన గోడలు, రేకులు, చిత్రపటాలు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు, కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆందోళనకు దిగారు. సీఐ వెంకటనారాయణ, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. స్థానికంగా పని చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చెట్టు కొమ్మ విరిగి పడి రేకులు, పురాతన గోడలు, చిత్రపటాలు ధ్వంసమయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకులు అంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కార్పొరేటర్ ధర్మపురి అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లగా ఆలయ పునరుద్ధరణకు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఘటనకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని నాలుగో టౌన్ ఎస్సై సందీప్ తెలిపారు. స్థానికుడు హరీశ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చర్యలు తీసుకోవాలి : ధన్‌పాల్

సుభాష్‌నగర్: మైసమ్మ ఆలయాన్ని కొందరు కావాలనే ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసు కోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ధ్వంసమైన ఆలయాన్ని పరిశీలించారు. నగరంలో కొందరు గొడవలు సృష్టించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా ఇలాంటి ఘటనలపై నోరెత్తకపోవడం ఆయన చేతకానితనానికి నిదర్శనమన్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డీఎంహెచ్‌వో తీరుతో నష్టపోయాం



నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నిర్లక్ష్య వైఖరితో తాము రెండేళ్ల సర్వీస్ కోల్పోయామని, ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కొత్త ఏఎన్ఎంలు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును వేడుకున్నారు. ఏఎన్ఎం పోస్టులకు ఎంపికై పోస్టింగ్ ఆర్డర్ కోసం ఎదురు చూస్తున్న 67 మంది తమ పిల్లలతో కలిసి బుధవారం కలెక్టరేట్‌కు వచ్చి ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2021లో జిల్లాలో 67 ఏఎన్ఎం పోస్టుల భర్తీ జరిగిందని పేర్కొన్నారు. ఓ అభ్యర్థి రిజర్వేషన్‌పై అభ్యంతరం తెల్పడంతో ఈ ప్రక్రి య నిలిచిపోయింది. అప్పటి నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రెండురోజుల క్రితం హైదరాబాద్‌లో వైద్యశాఖ కమిషనర్, మంత్రి హరీశ్‌రావును కలిశామన్నారు. ఏఎన్ఎంలకు న్యాయం చేయాలని మంత్రి కమిషనర్‌ను ఆదేశించారని చెప్పారు. స్పందించిన కలెక్టర్ వారంలో ఆర్డర్ కాపీలు ఇస్తామని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి

- 38.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- వీసీలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, డీఎస్‌వో

సుభాష్‌నగర్: ధాన్యం కొనుగోళ్లు దాదాపుగా చివరి దశకు చేరుకున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. బుధవారం ఆయన సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్‌లతో కలిసి కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లు, కస్టం మిల్లింగ్ రైస్ తదితర అంశాలపై వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం సేకరణ, రైస్‌మిల్లులకు తరలింపు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా గతేడాది 28.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఈ ఏడాది ఇప్పటికే 38.5 లక్షల మెట్రి క్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామ ని వివరించారు. 4.55 లక్షల మంది రైతుల వద్ద ధాన్యం సేకరించామని తెలిపారు. ధాన్యం దిగుబడులకు అనుగుణంగా అదనంగా 400 కొనుగోలు కేంద్రాలను సైతం అందుబాటులో ఉంచామన్నారు. అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తూ రైతులకు ఊరటనిచ్చిందన్నారు. మరో 15 రోజులు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ధాన్యాన్ని భద్రపరిచేందుకు వీలుగా అవసరమైన చోట గిడ్డంగులను గుర్తించాలన్నారు. ధాన్యానికి తరుగు తీయకుండా రైతులకు మద్దతు ధర అందేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 5.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మరో 90వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలు ఉన్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరా చేసేందుకు జిల్లాలోని రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఎఫ్‌సీఐ అనుమతించడం లేదన్నారు. ఈవిషయమై మంత్రి స్పందిస్తూ, త్వరలోనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్దేశిత లక్ష్యం మేరకు రైస్‌మిల్లర్లు సీఎంఆర్‌ను అందించేలా చూడాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీసీవో సింహాచలం, సివిల్ సప్లయ్స్ డీఎం జగదీశ్ పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ పంచాయితీ కొలిక్కి వచ్చేనా!

- నేడు తెయూ పాలకమండలి సమావేశం
- మీటింగ్‌కు వెళ్లడం లేదన్న వీసీ
- ఈసీ మెంబర్లకు ముగ్గురి పేర్లు మెసేజ్ చేసిన వీసీ
- వీసీ పంపించిన లాయర్ నోటీసులపై చర్చించే అవకాశం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ పంచాయితీ ఈ సారైనా కొలిక్కి వచ్చేనా అని వర్సిటీ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. గురువారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో తెయూ పాలక మండలి(ఈసీ) సమావేశం నిర్వహించనున్నారు. అయితే ఈసారి కూడా తాను ఈసీ సమావేశానికి హాజరు కావడం లేదని వీసీ రవీందర్‌గుప్తా స్పష్టం చేశారు. మే 15 నుంచి వర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ ఖాళీగా ఉంది. దీంతో వర్సిటీ రోజూవారీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రిజిస్ట్రార్ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. వీసీపై వచ్చిన అవినీతి ఆరోపణల సంగతి పక్కకు వెళ్లి ఇప్పుడు రిజిస్ట్రార్ వ్యవహారం కీలకంగా మారింది. మొదట రిజిస్ట్రార్ వివాదం సద్దుమణిగితే ఆ తర్వాత వీసీపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించేందుకు ఈసీ సిద్ధమవుతోందని తెలుస్తోంది.

యాదగిరికే ఆర్డర్స్ ఇస్తారా.. కొత్త రిజిస్ట్రార్ వస్తారా..?

2023 ఏప్రిల్ 19న జరిగిన ఈసీ సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధినిని తొలగించి ప్రొఫెసర్ యాదగిరిని రెండేళ్లపాటు రిజిస్ట్రార్‌గా నియమించారు. అప్పటి నుంచి ఈ వ్యవహారం వీసీ వర్సెస్ ఈసీగా మారింది. వీసీ ఏకంగా కళాశాల విద్యాకమిషనర్ నవీన్‌మిట్టల్‌పైనే ఆరోపణలు చేసేంత వరకు చేరుకుంది. ఈసీ రిజిస్ట్రార్‌గా నియమించిన యాదగిరికి ఆర్డర్స్ లేవని ఆయనను రిజిస్ట్రార్‌గా గుర్తించేదే లేదని వీసీ తెగేసి చెబుతున్నారు. ఉస్మానియా వర్సిటీ నుంచి ప్రొఫెసర్ నిర్మలదేవిని రిజిస్ట్రార్‌గా నియమిస్తే ఐదు రోజుల్లోనే ఆమె తిరిగి ఓయూకు వెళ్లిపోయారు. 55వ ఈసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయాలని వీసీ రవీందర్ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు యాదగిరి రిజిస్ట్రార్ కుర్చీ నుంచి తప్పుకున్నారు. అయితే మే 5న నిర్వహించిన ఈసీ సమావేశంలో తిరిగి యాదగిరిని రిజిస్ట్రార్‌గా పునర్నియామకం చేశారు. ఆయన మళ్లీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే వేతనాలు రాక రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్పందించిన ఈసీ మెంబర్లు వీసీపై ఒత్తిడి తెచ్చి మే 9న ఆయనను క్యాంపస్‌కు పిలిపించారు. వీసీ, రిజిస్ట్రార్‌లతో సమావేశమై ఉద్యోగులకు వేతనాలు వచ్చేలా కృషి చేశారు. పాలక మండలి మార్గదర్శకత్వంలో రిజిస్ట్రార్‌తో కలిసి వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని వీసీ పేర్కొన్నారు. ఇక వివాదం సద్దుమణిగినట్లేనని అంతా భావించారు. అయితే వీసీ ఆదేశాల మేరకు సెక్యూరిటీ సిబ్బంది మే 15న రిజిస్ట్రార్ కార్యాలయం తాళం తీయలేదు. యాదగిరికి ఆర్డర్స్ లేవని అందుకే వారం రోజుల్లో కొత్త రిజిస్ట్రార్‌ను నియమిస్తామని వీసీ ప్రకటించారు. వీసీ చర్యలతో మనస్థాపానికి గురైన యాదగిరి రిజిస్ట్రార్ చాంబర్‌కు రావడం మానేశారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకునే వరకు తాను రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించేది లేదని ఆయన స్పష్టం చేస్తున్నారు. యాదగిరికి బదులుగా తెలంగాణ వర్సిటీకే చెందిన ప్రొఫెసర్లలో ఒకరిని రిజిస్ట్రార్‌గా నియమించేందుకు వీసీ ప్రయత్నాలు ప్రారంభించారు. అందరిని కలిసి రిజిస్ట్రార్‌గా చేయాలని కోరారు. అయితే ఈసీ ఆమోదం లేనిదే తాము రిజిస్ట్రార్‌గా చేయబోమని వారంతా వీసీకి స్పష్టం చేశారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా వీసీ ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను ఈసీ మెంబర్లకు బుధవారం మేసేజ్ చేశారు. వారిలో ఒకరిని రిజిస్ట్రార్‌గా ఆమోదించాలని కోరుతున్నారు. అయితే వీసీ ప్రతిపాదనను ఈసీ మెంబర్లు అంగీకరించే పరిస్థితులు లేవని తెలుస్తోంది. వారంతా యాదగిరి వైపే మొగ్గు చూపుతున్నారు.

నిబంధనలకు విరుద్ధం

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉండడం వల్ల నేను గురువారం జరిగే ఈసీ సమావేశానికి వెళ్లడం లేదు. ఈసీ చైర్మన్‌గా నేను ఆహ్వానించకుండా, నాకు సమాచారం లేకుండా మిగిలిన సభ్యులు సమావేశం నిర్వహించడం నిబంధనలకు విరుద్ధం. యాదగిరికి బదులుగా అరుణను రిజిస్ట్రార్‌గా చేద్దామని చెబితే ఈసీ మెంబర్లు తిరస్కరించారు. మళ్లీ వర్సిటీకి చెందిన ముగ్గురు అధ్యాపకుల పేర్లను ఈసీ మెంబర్లకు మెసేజ్ ద్వారా ప్రతిపాదించాను. వారిలో ఒకరిని రిజిస్ట్రార్‌గా ఆమోదిస్తే నేను నియామక ఉత్తర్వులు జారీ చేస్తాను.
- రవీందర్‌గుప్తా, వీసీ

చర్యల వేగవంతంపై చర్చ

ఈసీ సమావేశంలో చర్చించేందుకు కొత్తగా ఎలాంటి మినిట్స్ లేవు. వీసీ రవీందర్ అక్రమాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ చర్యలు వేగవంతం చేయడంపైనే సమావేశంలో చర్చిస్తాం. వీసీ ఎవరిని ప్రతిపాదించినా ఆమోదించే అవకాశం లేదు. అలాగే రిజిస్ట్రార్‌గా యాదగిరికి నియామక ఉత్తర్వులు, గత ఈసీలో నిర్ణయించిన త్రిమెన్ కమిటీ నియామక ఉత్తర్వులు జారీ చేయాలని చర్చిస్తాం. వీసీపై విచారణకు ఏసీబీ, విజిలెన్స్, పోలీస్ కమిషనర్‌కు ప్రభుత్వం ద్వారా ఫిర్యాదు చేసిన లేఖలు ఈసీ మెంబర్లకు అందించాలని కోరతాం.
- గంగాధర్‌గౌడ్, ఈసీ మెంబర్

మంత్రి అండతోనే అక్రమంగా క్వారీ నిర్వహణ



బట్టాపూర్ క్వారీని పరిశీలించడానికి వెళ్తున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్: మంత్రి వేము ల ప్రశాంత్‌రెడ్డి అండదండలతోనే ఏర్గట్ల మండలం బట్టాపూర్ శివారులో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీని నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి మంత్రి బంధువులే గండి కొడుతున్నా అధికారులు మౌనం వహించడం పరిశీలిస్తే మంత్రి ఎంతగా అక్రమాలకు పాల్పడుతున్నాడో అర్థం అవుతుందన్నారు. బుధవారం బట్టాపూర్ క్వారీని, క్రషర్ మిషన్ పరిసరాలను డీసీసీ అధ్యక్షుడు కాంగ్రెస్ శ్రేణులతో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు 13 వేల క్యూబిక్ మీటర్ల వరకు బండరాయిని తవ్వడానికి అనుమతులు తీసుకుని సుమారు 15లక్షల క్యూబిక్ మీటర్ల బండను తొలిచారన్నారు. పంట పొలాలకు, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లేలా చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం విచారకరమన్నారు. బట్టాపూర్, ఏర్గట్ల పంచాయతీలకు సీనరేజ్ ఎగ్గొట్టడం, మండల పరిషత్‌కు సైతం ఆదాయం లేకుండా చేశారన్నారు. తాము క్వారీని పరిశీలించడానికి వచ్చిన వెంటనే పోలీసులు రావడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అక్రమ క్వారీపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, దేవారెడ్డి, నీరడి భాగ్య, వేణు, బాలే శ్రీనివాస్, కొాడ పెద్ద భూమేశ్వర్, మునీరొద్దిన్, మహేష్ యాదవ్, వెంకట్‌రెడ్డి, కొాత్రిపెల్లి లింగారెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ సిటీ: ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రతిభ చూపిన విశ్వబ్రాహ్మణ విద్యార్థుల నుంచి డివిజన్ల వారీగా ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం వీవా జిల్లా అధ్యక్షుడు ఘనపురం గోపాలకృష్ణాచార్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న ఆర్మూర్ డివిజన్‌లోని ఆసక్తి గల అభ్యర్థులు 9490006312 ను సంప్రదించాలన్నారు. నిజామాబాద్ డివిజన్ వారు ఈ నెలా 29న 9490019971, 9440745677ను సంప్రదించాలన్నారు. బోధన్ డివిజన్ అభ్యర్థులు ఈనెల 30న 9502921864, 9949719300 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఫైన్‌ఆర్ట్స్ పాఠశాలలో ప్రవేశాల కోసం..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మల్కాజ్‌గిరి ఫైన్‌ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ నిజామాబాద్ రీజనల్ కోఆర్డినేటర్ (ఆర్సీవో) మేరీ ఏసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనె 27లోపు టీఈటీడబ్ల్యూఆర్ఈఐఎస్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా రూ.100 లు రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. ఫైన్‌ఆర్ట్స్ పాఠశాలలో విద్యతో పాటు వివిధ కళారంగాల్లో బోధన చేస్తారని తెలిపారు. కర్ణాటక సంగీతం, హిందూస్తానీ సంగీతం, వయోలిన్, మృదంగం, తబల, కీబోర్డు, గిటార్, కూచిపూడి నృత్యం, థియేటర్ ఆర్ట్స్, పెయింటింగ్, డ్రాయింగ్ తదితర కళలలో శిక్షణ నిస్తారని తెలిపారు. వివరాలకు 1800–425–45678ను సంప్రదించాలని ఆర్సీవో సూచించారు.

నిండుకుండల్లా కాల్వలు

- మండు టెండల్లోనూ శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలువల్లో భారీగా నీటి నిల్వ



వరద కాలువలో నిల్వ ఉన్న నీరు



కాకతీయ కాలువలో నిల్వ ఉన్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ, వరద కాలువల్లో నీరు సమృద్ధిగా ఉంది. దీంతో మండుటెండల్లో సైతం రెండు కాలువల్లో నీరు నిండుకుండల ఉండటంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా గత వారం రోజుల క్రితం స్వల్పంగా నీటి విడుదల చేపట్టి కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామం వద్ద క్రాస్ రెగ్యులేటర్ గేట్ల తలుపులను మూసివేశారు. దీంతో కాలువలో నిండుకుండల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ నీటి ఆధారంగా కాలువకు ఇరువైపులా పంట భూములు గల రైతులు పైపులైన్లను వేసుకున్నారు. కాలువకు మోటర్లను అమర్చుకుని పంట భూములకు నీటి సరఫరా చేపట్టుకుంటున్నారు. ప్రస్తుత రోహిణికార్తె రావడంతో ఖరీఫ్ పంట సాగు ప్రారంభించనున్నారు. కాలువలో ఉన్న నీటి ద్వారా మక్క పంటను సాగు చేయుటకు రైతులు సిద్ధమవుతున్నారు.

రివర్స్ పంపింగ్‌తో నీటి మళ్లింపు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మిగులు జలాలను సద్వినియోగ పరుచుటకు నిర్మించిన వరద కాలువ ప్రస్తుతం కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి నీటిని మళ్లించుటకు ఉపయోగపడుతుంది. ఆ కాలువలో కూడ ప్రస్తుతం నీరు నిండు కుండల ఉంది. ఈ కాలువ ఆధారంగా కూడ రైతులు పైపులైన్‌లు వేసుకొని మోటర్లు బిగించుకున్నారు. ప్రస్తుతం వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే అవకాశం లేదు. ప్రాజెక్ట్ నీటి మట్టం 1075 అడుగులు ఉన్నంత వరకు మాత్రమే నీటి సరఫరా చేపట్టవచ్చు. కానీ ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉంది. దీంతో రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం నీళ్లను వరద కాలువలో నిల్వ చేశారు. దీంతో కాలువలో నీరు సమృద్ధిగా ఉంది.

సమృద్ధిగా భూగర్భ జలాలు..

కాకతీయ, వరద కాలువల్లో నీరు నిల్వ ఉండటం వల్ల కాలువల దిగువనున్న నేలల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. కాలువలో నీరు నిల్వ ఉండటంతో రెండు కాలువల పక్కన గల భూముల్లో నీరు సమృద్ధిగా ఉంది. దీంతో గతంలో కాలువల కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుతం నీటినిల్వతో మిగిలిన భూముల్లో పంటలను ముందస్తుగా సాగు చేసుకునే అవకాశ మాత్రం మిగిలింది. గత ఆరేళ్ల క్రితం కాకతీయ కాలువ ద్వారా లీకేజీ నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు రోడ్డెక్కారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కాలువల్లో నీరు నిల్వ ఉండటంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఉపయోగకరం..



కాకతీయ కాలువలో నీరు నిల్వ ఉండటం వల్ల ముందస్తుగా పంటలను విత్తుకునే అవకాశం ఉంది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుద ల చేపట్టి నిల్వ ఉంచడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాలువల్లో నీటిని నిల్వ ఉంచుతున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– రాజేందర్, ఆయకట్టు రైతు, బాల్కొండ

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి





కార్యక్రమంలో మాట్లాడుతున్న విఠల్‌రావు.. విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- ముగిసిన సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు

నిజామాబాద్‌నాగారం: సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటాలని జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం సీఎం కప్–2023 జిల్లాస్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, ఆకుల లలిత ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారుల కు, క్రీడా జట్లకు నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను వెలికి తీయాలనే సంకల్పంతో ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఆరోగ్యాల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగంగా మలుచుకోవాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన నిఖత్ జరీన్, హుస్సాముద్దీన్, యెండల సౌందర్య, గుగులోత్ సౌమ్య, పుల్లెల గోపీచంద్ వంటి అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఈ నెల 28నుంచి 31వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ సత్తా చాటాలన్నారు. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ తరహా క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ముత్తన్న, బాక్సింగ్ కోచ్ సంసాముద్దీన్, అంతర్జాతీయ బాక్సర్ హుస్సాముద్దీన్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న క్రీడాకారులు

సీఎం హామీలను నెరవేర్చాలి



తెయూ(డిచ్‌పల్లి): అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం తెయూ కాంట్రాక్టు అధ్యాయులు క్యాంపస్‌లోని లా కాలేజ్ ఎదుట నిరసన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలనే ఏకైక డిమాండ్‌తో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ కళాశాల లెక్చరర్స్, పాలిటెక్నిక్ లెక్చరర్స్‌తోపాటు వీఆర్‌ఏలను రెగ్యులర్ చేసిన ప్రభుత్వం వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల పట్ల చిన్నచూపు చూడటం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కాంట్రాక్టు అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహం నిలిపివేత



బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామంలో ఓ బాలికకు జరుగుతున్న వివాహాన్ని బాల రక్షాభవన్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మీ, రూరల్ పోలీసులు అడ్డుకున్నారు. ఖానాపూర్‌లో బుధవారం బాలికకు వివాహం జరుపుతున్నట్లు బాల రక్షాభవన్ అధికారులకు సమాచారం వెళ్లింది. దీంతో అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని వివాహాన్ని నిలిపివేయించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులకు విజయలక్ష్మీ కౌన్సిలింగ్ చేశారు.

బోర్గాం ఆలయంలో...

ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికకు నిజామాబాద్ నగరశివారు బోర్గాం వద్ద గల ఆలయంలో వివాహం జరుపుతుండగా బాల రక్షాభవన్ అధికారులు అడ్డుకున్నారు. అధికారులకు వచ్చిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి వివాహాన్ని నిలిపివేయించారు. బాల రక్షాభవన్ అధికారులు, పోలీసులతో రెస్క్యూ చేయించి బాలికను కమిటి ముందు హాజరు పరిచారు. అనంతరం బాలికను సఖి సెంటర్‌కు తరలించారు.

లారీని ఢీకొన్న బస్సు

- బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలు



భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై బుధవారం రాత్రి లారీ–బస్సు ఢీకొన్నాయి. ఈఘటనలో బస్‌డ్రైవర్‌కు గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి నిజమాబాద్ వైపు వెళ్తున్న బస్సు అదే దారిలో వెళ్తున్న లారీ ఢీ కొన్నాయి. ఈ ఘటనలో నిజామాబాద్–2 డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. బస్సు లో ప్రయాణిస్తున్న మరికొంత మందికి స్వల్ప గాయలయ్యాయి. స్థానికులు వెంటనే బస్సు డ్రైవర్‌ను కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు



విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మద్నూర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టాస్క్ ఫోర్స్ అధికారులు వ్యాపారులను హెచ్చరించారు. మండలంలోని మేనూర్, మద్నూర్, పెద్ద ఎక్లార గ్రామాల్లోని విత్తనాల దుకాణాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారు, ఏఏ కంపెనీలకు చెందినవి తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో బాన్సువాడ ఏడీఏ వినయ్ కుమార్, ఏవో సుధాకర్, మండల వ్యవసాయ అధికారి రాజు పాల్గొన్నారు.

బిచ్కుంద: నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్సు రద్దు చేస్తామని బాన్సువాడ ఏడీఏ వినయ్ కుమార్ హెచ్చరించారు. ఏవో పోచయ్యతో కలిసి ఆయన బిచ్కుందలో విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. పత్తి, సోయా, మక్కలు ఇతర విత్తనాలను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీకి సంబంధించిన విత్తనాలు, మందులను మాత్రమే విక్రయించడంతో పాటు రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృత్యువాత

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. బైక్ పైనుంచి పడి ఒకరు మృతిచెందగా.. బైక్‌ను ఐచర్ ఢీకొనడంతో ఒకరు, కుంటలో పడి మరొకరు మృత్యువాతపడ్డారు.



మృతిచెందిన పోశెట్టి

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం శివారులో బైక్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై అనిల్ రెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. రుద్రూర్ గ్రామానికి చెందిన బేకరీ పోశెట్టి(65) మంగళవారం సాయంత్రం బైక్‌పై రుద్రూర్ నుంచి వర్ని కి బయలుదేరాడు. సత్యనారాయణపురం శివారులో బైక్ ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లడంతో పోశెట్టి కింద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని బుధవారం మధ్యాహ్నం వ్యవసాయదారులు చూసి పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కూతురు సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కుంటలో పడి ఒకరు..

రామారెడ్డి: రామారెడ్డి గ్రామ శివారులోని కుంటలో పడి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన గంగారపు పోచయ్య(32) ఈనెల 14న ఎండ్రికాయలు పట్టుకొస్తానని ఇంటి నుంచి వెళ్లి, తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. రామారెడ్డి శివారులోని రేగడి కుంటలో బుధవారం కుళ్లిపోయిన శవం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడు పోచయ్యగా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతిపై తమకు ఎలాంటి సందేహాలు లేవని, ఎండ్రి కాయలు పట్టే క్రమంలో ఫిట్స్ రావడంతోపాటు, ఈత రాకపోవడంతో కుంటలో పడిపోయినట్లుగా భావిస్తున్నామని మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టుగా తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు..



శెకెల్లి రాజయ్య(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామశివారులోగల 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన శెకెల్లి రాజయ్య(54) బైక్‌పై బుధవారం మర్కల్ స్టేజీ వద్దగల అశోక్ గార్డెన్ వద్దకు బయలుదేరాడు. హైవేపై యూటర్న్ తీసుకునే క్రమంలో వెనుకనుంచి ఐచర్ వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



క్రైం కార్నర్

ప్రసవించిన 9 రోజులకే బాలింత మృతి

- వైద్యం సరిగ్గా చేయకపోవడంతోనే అని కుటుంబసభ్యుల ఆరోపణ



పల్లవి (ఫైల్)

బీబీపేట: తల్లి కావాలని ఎన్నో కలలు కని, ఆ కల నెరవేరి పది రోజులు కూడా గడవకముందే బాలింత తనువు చాలించి, బిడ్డకు దూరమైన ఘటన మండలంలోని కోనాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. కోనాపూర్ గ్రామనికి చెందిన ఆరుట్ల పల్లవి (26)కి పదిహేను నెలల క్రితం సిరిసిల్ల మండలం గన్నవారిపల్లి గ్రామానికి చెందిన బాబుతో వివాహం జరిగింది. కొన్ని రోజుల క్రితం డెలివరి కోసం పల్లవి కోనాపూర్‌లోని తల్లి గారింటికి వచ్చింది. ఈ నెల 15న కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో వైద్యులు పల్లవికి సర్జరీ చేసి డెలివరీ చేయగా.. కొడుకు జన్మించాడు. అనంతరం మూడు రోజులకు డిశ్చార్జి చేయగా.. మళ్లీ నాలుగో రోజు పల్లవికి కుట్లు విప్పడానికి ఆస్పత్రికి తీసుకెళ్లగా కుట్లలో నుంచి చీము, రక్తం కారడాన్ని గమనించి వైద్య సిబ్బంది మళ్లీ కుట్లు వేసి ఇంటికి పంపించారు. అయినప్పటికీ ఏమాత్రం తగ్గకపోవడంతో మంగళవారం తెల్లవారుజామున నొప్పి ఎక్కువ అవ్వడంతో కామారెడ్డికి ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మరణించింది. ఆస్పత్రిలో వైద్యం సరిగా చేయకపోవడం, కుట్లు సరిగా వేయకపోవడంతోనే పల్లవి ఆరోగ్యం క్షీణించిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పల్లవి మరణించడంతో కుమారుడు పాల కోసం ఏడ్చిన తీరు, భార్యను పోగొట్టుకొని భర్త, బిడ్డను పోగొట్టుకున్న తల్లిదండ్రులు ఏడ్చిన తీరు గ్రామస్తులను కన్నీరు పెట్టించింది.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు

రాజంపేట: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి కా మారెడ్డి జిల్లా మెజిస్ట్రేట్ బుధవారం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు. పొందుర్తి గ్రామానికి చెందిన ర్యానబోయిన జనార్దన్ ఇటీవల డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడగా.. అతడిని బుధవారం కోర్టులో హాజరుపరిచారు. జిల్లా కోర్టు అతడికి రూ.200ల జరిమానాతోపాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో స్టూడియో దగ్ధం



కాలిపోయిన కంప్యూటర్ సామగ్రి

ఇందల్వాయి: మండల కేంద్రంలోని రియాన్ ఫొటో స్టూడియోలో బుధవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. దీంతో దుకాణంలోని కంప్యూటర్ సామగ్రితో పాటు ఫర్నీచర్ దగ్ధమైంది. సుమారు రూ. 40వేల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

టైరు పేలి వడ్ల లారీ బోల్తా





రహదారిపై బోల్తా పడిన వడ్ల లారీ.. వడ్ల బస్తాలను మరో లారీలోకి మారుస్తున్న హమాలీలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి నుంచి కోటగిరి మండలంలోని రైస్‌మిల్లుకు వడ్ల బస్తాలు తీసుకుని వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో 660 వడ్ల బస్తాలను (264 క్వింటాళ్లు) లారీ (నెంబర్ ఎంహెచ్ 29 టీ 1891)లో లోడ్‌వేసి కోటగిరి మండలంలోని బాలాజీ ట్రేడర్స్ రైస్‌మిల్‌కు తరలిస్తున్నారు. నడిపల్లి శివారులోని భారత్ పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే వేగంగా వెళుతున్న లారీ డివైడర్‌ను ఢీనడంతో టైరు పేలింది. దీంతో కుడి వైపు రోడ్డుపై లారీ బోల్తా పడటంతో వడ్ల బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో సుమారు రెండు గంటల పాటు వడ్ల బస్తాలు రోడ్డుపై పడి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు సమాచారం ఇచ్చినా అటు పోలీసులు, ఇటు సంబంధిత అధికారులు ఎవరూ సరైన సమయంలో స్పందించలేదు. డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, సీఈవో కిషన్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరో లారీని రప్పించారు. హమాలీల సాయంతో వడ్ల బస్తాలను మరో లారీలోకి ఎక్కించి కోటగిరి రైస్‌మిల్‌కు పంపించారు. లారీ బోల్తా పడిన సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.

బకాయి వేతనాలు చెల్లించాలి



ఖలీల్‌వాడి: ఈఎస్ఐ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఆరు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. దండి వెంకట్ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ కార్మికులు ఇంటి కిరాయి కట్టలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. 5 నెలలుగా ఇంటి కిరాయి కట్టలేదని ఇంటి యజమానులు ఇల్లు ఖాళీ చేయాలని వేధిస్తున్నారని, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, బియ్యం, బీపీ షుగర్ మందులు కొనలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షులు మధు, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నగర కార్యదర్శి గంగా శంకర్, తదితరులు పాల్గొన్నారు.